# వీడ్కోలు

భారత రాయబార కార్యాలయంలో సరిగ్గా రాత్రి ఏడూ ఇరవై నిముషాలకు విందు మొదలయినది సుఖాడియా గౌరవార్థం — ఆయన వీడ్కోలు సందర్భంగా అమెరికాలోవున్న భారత రాయబార కార్యాలయంలో ఆ విందు యేర్పాటు చేయబడినది.

కొన్నాళ్ళక్రితం భారతదేశ రాయబారిగా సుఖాడియా అమెరికా వచ్చాడు. ఆయనకు- ఆయన కుటుంబసభ్యులకు అమెరికా, ఆ దేశ వాతావరణం ఎంతగానో నచ్చింది.

వాళ్ళంతా ఎంతో సంతోషంగా వున్నారు. మళ్ళీ తిరిగి మాతృదేశానికి వెళ్ళబోతున్నారు.

విందుకు చాలామంది హాజరైనారు.

ఏర్పాట్లన్నీ చాలా ఘనంగా జరిగాయి. అక్కడా అక్కడా అమర్చిన స్పీకర్లలోనించి సన్నని సంగీతం గాల్లో కలిసి వస్తోంది. సందడిగా వుంది. మెర్క్యూరీ దీపాలు కాంతి విరజిమ్ముతున్నాయి.

వచ్చిన వారందరిలో చిరునవ్వుతో కరచాలనంచేసి వీడ్కోలును స్వీకరిస్తున్నాడు సుఖాడియా.

అభిమానంతో స్నేహితులు తీసుకువచ్చిన బహుమతులను అందుకోవటంలో సుఖాడియా బిజీగా వున్నాడు. రాయబార కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు కొంతమంది తమ జ్ఞాపకచిహ్నాలుగా బహుమతులను అందజేశారు సుఖాడియాకు.

"హలో సర్"

వెనక్కు తిరిగాడు సుఖాడియా.

"హలో" విష్ చేశాడు.

చిరునవ్వుతో నిలబడివున్నాడు నలభైయేళ్ళ మిశ్రా. పక్కనే ఆయన భార్య సుజీ కూడా చిరునవ్వుతో నిలుచుంది.

మిశ్రా రాయబార కార్యాలయ ఉద్యోగి.

సుఖాడియాతో అతను కరచాలనం చేశాడు. తర్వాత కోటు జేబులోనించి చిన్న పెట్టెను బయటకు తీశాడు. దాన్ని తెరుస్తున్నప్పుడు సుఖాడియా ఆసక్తిగా చూశాడు. అందులో వున్నది ఒక ఎలక్ట్రానిక్ చేతి గడియారం.

"మీ ప్రయాణం సుఖంగా జరగాలనీ, మీరు మరోసారి అమెరికా రావాలనీ, స్నేహకానుకగా ఇది నా బహుమతి" అంటూ మిశ్రా ఆ వాచీని సుఖాడియాకు అందజేశాడు.

ఇస్తూ దానికివున్నా ఏదో బటన్ నొక్కాడు. అప్పుడు తిరిగి అతను మాట్లాడిన మాటలు బయటకు వచ్చాయి. ఇంకో బటన్ నొక్కాడు. మ్యూజిక్ వినపడింది. ఇంకొన్ని అద్భుతాలు ఆ వాచీలో వున్నట్టుగా మిశ్రా- సుఖాడియాకు చెప్పాడు.

"ఫెంటాస్టిక్.... థాంక్‌యూ వెరీమచ్" అన్నాడు సుఖాడియా కృతజ్ఞతగా. అప్పటికప్పుడే తన చేతికి వున్న వాచీని తీసి కొత్త వాచీని పెట్టుకున్నాడు.

"రోజీ రాలేదా?" అడిగాడు సుఖాడియా.

"హెల్త్ సరిగా లేదు. తన వీడ్కోలు తెలియజేయమన్నది" చెప్పాడు మిశ్రా చిరునవ్వుతో. రోజీ అతని చెల్లెలు.

విందు ముగిశాక సరిగ్గా పదీ ఇరవైకి విమానం బయల్దేరింది.

"గుడ్ బై టు అమెరికా" అన్నారు వాళ్ళంతా కిందికి చూస్తూ.

చివరిసారిగా రోజీ కనపడితే బావుండేదనుకున్నాడు సుఖాడియా. వారం క్రితం తను వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఎవ్వరూ లేరని మోహంతో ఆమెను బలవంత పెట్టకుండా వుండాల్సిందని కూడా అనుకున్నాడు. ఐనా రోజీ మంచిది. మిశ్రాకు విషయం చెప్పివుంటే అతను అభి మానంతో వచ్చి తనకు పీడ్కోలు ఇచ్చేవాడు కాదు.

ఆయనలా ఆలోచిస్తున్నప్పుడు సరిగ్గా పదకొండు గంటల య్యింది. అప్పుడే ఆయన చేతికివున్న వాచీలోనించి ముల్లు లాంటిది బయటకువచ్చి చేతిమీద చిన్నగా గుచ్చుకుంది. ఆయన వులిక్కిపడి చూశాడు. ఏమీ కనపడలేదు. అప్పటికే ఆ ముల్లు లోపలకు వెళ్ళి పోయింది.

కాని- నాలుగు నిముషాలకే ఆయనలో కదలికలన్నీ ఆగి పోయాయి. ఇంకో ఐదు నిముషాలకు సుఖాడియాలో చలనం పూర్తిగా ఆగిపోయింది.

చివరిసారిగా ఆయన ఇలా అనుకున్నాడు- "రోజీ విషయమై నేను పొరపాటు పడ్డాను".

*

(22-1-86 కృష్ణాపత్రిక సచిత్ర వారపత్రిక)